## బీసీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

నల్లగొండ, జూన్ 18 : తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్) నల్లగొండ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్-2025 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఈబీసీ, ఎస్సీ అభ్యర్థులు tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 7న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా, అందులో ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన వంద మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని, మరో 50 మందిని ఇంతకు ముందే యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పత్రాలతో జులై 3లోపు నేరుగా టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు వసతి, భోజన సదుపాయం, రవాణా కోసం నెలకు రూ.5వేలు, ఒక్కసారి బుక్ ఫండ్ రూ.5వేలు ఇస్తారని తెలిపారు.

## నేరాల నియంత్రణకు కృషి

- నల్లగొండ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్ర పవార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూన్ 18 : జిల్లాలో గంజాయి, డ్రగ్స్‌తోపాటు ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తానని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన శరత్ చంద్ర పవార్ మంగళవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వహించిన చందనాదీప్తి సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా బదిలీ కావడంతో అమె స్థానంలో శరత్ కుమార్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలతోపాటు నేరాలను నియంత్రించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్‌తోపాటు ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. గతంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా, సెంట్రల్ జోన్ డీసీపీగా, పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో సీనియర్ అధికారుల సహకారాలతో ప్రజలకు శాంతిభద్రతలు కల్పిస్తానని చెప్పారు. మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలను సహించేది లేదని, అలాంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డయల్ 100కు వచ్చిన ప్రతి సమస్యపై స్పందించడంతోపాటు వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. దొంగతనాలు, జీరో దందా వ్యాపారాలు చేసే వారిపై పీడీ యాక్టులు సైతం నమోదు చేస్తామన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పవార్‌కు అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేశ్, శివరాంరెడ్డి, రాజశేఖర్ రాజు, గిరిబాబు, శ్రీనివాస్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, డీపీఓ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

# అగ్రస్థానమే 'టీమ్ నల్లగొండ' లక్ష్యం

- పనిచేస్తే ప్రోత్సాహం.. చేయకపోతే కఠిన వైఖరి
- కలెక్టర్ నారాయణరెడ్డి మార్క్ రివ్యూ
- వివిధ శాఖల అధికారులతో సమీక్షలు.. దిశానిర్దేశం

### చిత్తశుద్ధితో ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలు
### వారంలో 3 రోజులు అధికారుల క్షేత్రస్థాయిలోనే..

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి





కలెక్టరేట్‌లో సమావేశంలో పాల్గొన్న అధికారులు

నల్లగొండ ప్రతినిధి, జూన్18(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సి.నారాయణరెడ్డి తనదైన శైలిలో తొలిరోజే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంగళవారం ఉదయం మండల స్థాయి అధికారులతో, మధ్యాహ్నం తర్వాత జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించారు. జిల్లాలో ప్రజలకు సంతృప్తినిచ్చేలా అధికార యంత్రాంగం పనితీరు ఉండాలని దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల అధికారులుగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. పనిచేసే వారికి తగిన ప్రోత్సాహం ఉంటుందని, పనిచేయని వారి పట్ల కూడా కఠిన చర్యలు తప్పవని సుతిమెత్తని హెచ్చరికలు తొలి రివ్యూల్లోనే జారీ చేశారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, జిల్లా అధికారులు వారంలో మూడు రోజుల పాటు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్‌గా హరిచందన స్థానంలో ఆదివారం బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి సోమవారం బక్రీద్ సెలవు కావడంతో మంగళవారం తన పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా 'టీమ్ నల్లగొండ' అంటూ కొత్త ఫార్ములాతో అన్ని విభాగాల్లోనూ సమష్టి పనివిధానంతో రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేద్దామని జిల్లా అధికార యంత్రాంగానికి పిలుపునివ్వడం విశేషం.

#### పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం నారాయణరెడ్డి మొదటిసారిగా జిల్లా అధికారులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. జిల్లా అధికారులు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఆయా పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రతి శాఖ ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులపై ఆలోచన చేయాలని, వారంలో 3 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో బాగా పనిచేసేవారిని ప్రోత్సహిస్తామని, అదే సమయంలో నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ పథకాల అమలులో 'టీమ్ నల్లగొండ' మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని, పథకాల అమలు విషయంలో ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను కలుపుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనలో రాజీ పడవద్దని, నాణ్యమైన విద్యను అందించాలని, పదో తరగతి ఫలితాల్లో ప్రస్తుత ఒరవడిని కొనసాగించాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున యూరియా, ఎరువుల పంపిణీ సక్రమంగా జరుగాలని, నకిలీ విత్తనాల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో అధికారులు అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వైద్య శాఖ పనితీరు సైతం ప్రజల మన్ననలు పొందేలా ఉండాలని ఆదేశించారు. అన్ని ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది హాజరు సక్రమంగా ఉండాలని, జిల్లాలో సాధారణ ప్రసవాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులను, మండలాల ప్రత్యేక అధికారులుగా నియమించామని, వారి శాఖల పనులతోపాటు, ఆయా మండలాలపై సైతం ఎక్కువ దృష్టి కేంద్రీకరించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ముందుగా దృష్టి సారించాలని, ప్రతి సోమవారం మండలాల్లో నిర్వహించే ప్రజావాణిపై ప్రత్యేక సూచనలు చేశారు. ఎంపీడీఓ నోడల్ అధికారిగా తాసీల్దార్, ఎంపీఓ, ఏపీఎం, వ్యవసాయ అధికారి, ఎంపీడీఓలతోపాటు ఇతర మండల స్థాయి అధికారులందరూ ప్రజావాణిలో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఈ దరఖాస్తులను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజావాణి కొనసాగాలని ఆదేశించారు. మండల స్థాయిలో 15 రోజులైనా పరిష్కారం కానీ ఫిర్యాదులను జిల్లా స్థాయికి పంపాలన్నారు. మండల స్థాయి ప్రజావాణి ప్రారంభిస్తున్న నేపథ్యంలో వచ్చే సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రకటించారు. సమావేశాల్లో ఆర్డీఓలు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## చండూరు ఎంపీపీగా అవ్వారి గీత



ఎంపీపీ గీతా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

గట్టుప్పల్, జూన్ 18 : చండూరు ఎంపీపీగా గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ అవ్వారి గీతా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపికను నిర్వహించారు. 5 మంది బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు హాజరయ్యారు. అనంతరం అవ్వారి గీతను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ పల్లె కళ్యాణీరవికుమార్‌తో పాటు, పెండోట వెంకటమ్మ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికకు హాజరు కాలేదు. గతంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించినా కోరం లేక వాయిదా పడింది. ఈసారి కోరంతో సంబంధం లేకుండా వచ్చిన మెజార్టీ సభ్యులతోనే ఎంపీపీ ఎన్నిక నిర్వహించినట్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న అవ్వారి గీత ఇప్పుడు పూర్తిస్థాయి ఎంపీపీ బాధ్యతలు చేపట్టారు. ఆమెకు పలువురు ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీడీఓ అనురాధ, ఎంపీటీసీలు గౌరిగె సత్తయ్య, చెరుపల్లి భాస్కర్, కావలి మంగమ్మ, తిప్పర్తి లక్ష్మమ్మ, సూపరింటెండెంట్ మనోహర్, చంద్రయ్య, అంజయ్య, కిశోర్, ఆనంద్, అయోధ్య పాల్గొన్నారు.

## 22న డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక

- బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్.. షెడ్యూల్ విడుదల

నల్లగొండ, జూన్ 18 : నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం చైర్మన్ ఎన్నికలను ఈ నెల 22న నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ డిప్యూటీ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి గోలి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ విడుదల చేసి కార్యాలయంలో నోటీసు బోర్డుపై అతికించారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన డీసీఎంఎస్ ఎన్నికల్లో మొత్తం 10 మంది డైరెక్టర్లకు గానూ సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యను చైర్మన్‌గా, దుర్గంపూడి నారాయణరెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అయితే.. వట్టె జానయ్య ప్రాథమిక సహకార సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని సక్రమంగా నిర్వహించలేదన్న కారణంగా 2023 నవంబర్‌లో డీసీఓ ఆ పాలకవర్గాన్ని రద్దు చేశారు. దాంతో వట్టె జానయ్య చైర్మన్ పదవిని కోల్పోగా.. వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. సహకార చట్టం ప్రకారం ఆరు నెలల్లో చైర్మన్ ఎన్నికలను నిర్వహించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన పాలకవర్గ సమావేశంలో ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేయగా.. జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ చైర్మన్ ఎన్నిక షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. చైర్మన్ ఎన్నికకు ఈ నెల 22న ఉదయం 9నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11నుంచి 11:30 వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 2:30కు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించి, మధ్యాహ్నం 3నుంచి 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీ జరిగితే 5:30 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను ప్రకటిస్తారని తెలిపారు.

## వీడియో కాన్ఫరెన్స్ హాళ్లుగా రైతు వేదికలు

### గతంలో ఆరు, ఇప్పుడు మరో 25 కేంద్రాలు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం




నల్లగొండ, జూన్ 18 : కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ హాళ్లుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 141 రైతు వేదికలు ఉండగా, గతంలో ఆరింటిని వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చిన రేవంత్ సర్కార్.. మంగళవారం మరో 25 రైతు వేదికలను కాన్ఫరెన్స్ హాళ్లుగా మారుస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆయా కేంద్రాలను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చే ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. రైతులకు సాగులో మెళకువలు, శిక్షణ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లుగా మారుస్తుంది. ఇప్పటికే దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్ నియోజక వర్గంలోని చందుపట్ల, నల్లగొండ నియోజకవర్గంలోని తిప్పర్తి, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం రైతు వేదికల్లో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టమ్ తదితర సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్పు చేసింది. వీటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 6న ప్రారంభించారు. తాజాగా జిల్లాలోని మరో 25 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి జిల్లా వ్యవసాయ అధికారికి జాబితాను పంపించారు. చింతపల్లి, చందంపేట, డిండి మండలం గుండ్లపల్లి, కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల, నేరెడుగొమ్ము, పీఏపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడ్గులపల్లి మండలం చిరుమర్తి, చండూరు మండలం బంగారిగడ్డ, మర్రిగూడ, నాంపల్లి, అనుముల మండలం కొత్తపల్లి, గుర్రంపోడు మండలం కొప్పోలు, నిడమనూరు, తిరుమలగిరి, పెద్దవూర, చిట్యాల మండలం ఉరుమడ్ల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, కేతేపల్లి, కనగల్, నల్లగొండ మండలం దోమలపల్లి, శాలిగౌరారం రైతు వేదికలను రైతు వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చనున్నారు.

## బదిలీల కోసం అడ్డదారులు!

- పాఠశాలలో చేరిన సంవత్సరం మార్పుతో సీనియారిటీ జాబితాలో చోటు?
- స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో మరో వ్యవహారం బహిర్గతం




రామగిరి, జూన్ 18 : బదిలీలు, పదోన్నతుల కోసం కొందరు టీచర్లు అడ్డదారులు తొక్కుతూ విద్యా వ్యవస్థకు కలంకం తెస్తున్నారు. ఇటీవల పీఈటీల పదోన్నతుల వ్యవహారంలో నకిలీ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్ సృష్టించి సినియార్టీ జాబితాలో చోటు దక్కించుకున్న విషయం మరువకముందే.. స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో మరో ఘటన వెలుగు చూసింది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులంతా సబ్జెక్టు వారీగా బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. వాటి ఆధారంగానే విద్యాశాఖ సీనియారిటీ జాబితాలను వెల్లడించింది. అయితే.. గతంలో వెల్లడించిన పాత జాబితాలో కొంత మంది ఉపాధ్యాయుల సీరియల్ నెంబర్, కొత్తగా వెల్లడించిన జాబితాల్లో సీరియల్ నెంబర్‌లో మార్పులు వచ్చినట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. గుండ్లపల్లి (డిండి) మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు తాను ఉద్యోగంలో (పాఠశాలలో) చేరిన సంవత్సరాన్ని ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేసింది. దీంతో బదిలీ సీనియారిటీ జాబితాలో ఆమె ముందు వరుసలోకి చేరింది. ఇలాంటి వారు ఇంకా కొంత మంది ఉన్నారని, ఆన్‌లైన్‌లో సమర్పించిన అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇలాంటి వారితో నిజంగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎంజీయూ డిగ్రీ ఆల్మనాక్ విడుదల

రామగిరి, జూన్ 18 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం సెకండియర్ మూడో, ఐదో సెమిస్టర్ ఆల్మనాక్‌ను వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులతో విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సెల్ కొప్పుల అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18నుంచి నవంబర్ 1వరకు మూడు, ఐదో సెమిస్టర్ నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. ఆల్మనాక్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచడంతోపాటు కళాశాలలకు చేరవేసినట్లు తెలిపారు. ఈ టైం టేబుల్‌ను ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాటించాలని సూచించారు.

## సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తులు

నల్లగొండ/ సూర్యాపేట అర్బన్, జూన్ 18 : 2024-25 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ మరియు మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు నవీన్ కుమార్, చిట్టిపాక రాములు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద మందిని రాత పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17నుంచి జూలై 10 వరకు www.tsstudycircle.co.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జూలై 21న హైదరాబాద్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23546552, 9396621492, 9989129935 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన డిగ్రీ ఉతీర్ణులైన వారు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ-ఇ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతితో కూడిన పది నెలల కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్

నల్లగొండ, జూన్ 18 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన టీజీ పీఎస్సీ గ్రూప్-2కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి అర్హులైన అభ్యర్థులు https://tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం నాలుగు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించనుండగా.. మొదటిది జూలై 8, 9 తేదీల్లో, రెండోది 15, 16, మూడోది 22, 23, నాలుగో టెస్ట్ జూలై 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ లేదా 08682-220007లో సంప్రదించాలని సూచించారు.

## పోలీస్ స్టేషన్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

- భూవివాదం కేసులో ఐదు రోజులుగా స్టేషన్‌కు రప్పిస్తున్నారని మనస్తాపం
- పోలీసుల వేధింపులే కారణమంటూ బాధిత కుటుంబం ఆవేదన
- నిడమనూరు స్టేషన్‌లో ఘటన



నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న వెంకటాచారి

నిడమనూరు, జూన్ 18 : భూ వివాదం నేపథ్యంలో నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి 11 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తన వెంట కవర్‌లో తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను ఒక్కసారిగా తీసి తాగేశాడు. గమనించిన సిబ్బంది డబ్బాను లాక్కొని స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమం కావడంతో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు, అనంతరం నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానకు తరలించి వైద్య సేవలందిస్తున్నారు.

### వివాదం ఇది..

ఎర్రబెల్లి గ్రామానికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి (65) తన భార్య లింగమ్మ పేరున ధర్మాపురం గ్రామ శివారులో ఉన్న ఎ.1.16 గుంటల భూమిని పద్దెనిమిది సంవత్సరాల క్రితం తన కూతురు ధనలక్ష్మి వివాహం కోసం కన్నెకల్‌కు చెందిన తన మేనల్లుడు దేశోజు కనకాచారికి అమ్మకానికి పెట్టి రూ.50 వేలు తీసుకున్నాడు. మిగతా మొత్తం చెల్లించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయలేదు. గత 18 ఏండ్లుగా ఇరువురి నడుమ వివాదం కొనసాగుతున్నది. సదరు భూమికి వెంకటాచారి భార్య లింగమ్మ పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరవగా ఆమె తన కుమార్తె మేలోజు ధనలక్ష్మి పేరున పట్టా చేశారు. కాగా దేశోజు కనకాచారి సదరు వివాదాస్పద భూమి చుట్టూరా ఇటీవల కంచె ఏర్పాటు చేశాడు. దీంతో వెంకటాచారి ఈయనతో పాటు మేలోజు యాదయ్య, మేలోజు ధనలక్ష్మి, ట్రాక్టర్ డ్రైవర్ మసిముక్కు శ్రీను ఈ నెల 11న కంచె ను తొలగించి ట్రాక్టర్‌తో భూమిని దున్నారు. 13న కనకాచారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఐదు రోజులుగా స్టేషన్‌కు రప్పిస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు డబ్బాతో వెంకటాచారి నిడమనూరు పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాడు. ఎస్‌ఐ. సమక్షంలోనే పురుగుల మందు తాగాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై నిడమనూరు ఎస్‌ఐ జె.గోపాల్‌రావు వివరణ కోరగా దేశోజు కనకాచారి ఫిర్యాదు మేరకు వెంకటాచారితోపాటు మరో ముగ్గురి పై ఈ నెల 13న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంకటాచారికి ఆయన సోదరుడు ధనయ్యాచారితో ఉన్న మరో భూ వివాదం కారణంగానే ఈ ఘటనకు పాల్పడినట్లు వివరించారు. తాము వెంకటాచారిని స్టేషన్‌కు పిలువలేదని, ఆయన పురుగుల మందు తాగి స్టేషన్ లోపలికి రాగానే గమనించి దవాఖానకు తరలించామని చెప్పుకొచ్చారు.